# తీతుకు వ్రాసిన పత్రిక 3వ అధ్యాయము

## క్రైస్తవ ప్రవర్తన – దాని ఆధారము

అధిపతులకును అధికారులకును లోబడువిధేయులుగా ఉండవలెననియు, 2 ప్రతి సత్కార్యము చేయుటకు సిద్ధపడియుండవలెననియు, మనుష్యులందరియెడల సంపూర్ణమైన సాత్వికమును కనుపరచుచు, ఎవనిని దూషింపక, జగడమాడని వారును శాంతులునై యుండవలెననియు, వారికి జ్ఞాపకము చేయుము. 3 ఎందుకనగా, మనము కూడ మునుపు అవివేకులమును అవిధేయులమును మోసపోయిన వారమును నానావిధములైన దురాశలకును భోగములకును దాసులమునైయుండి దుష్టత్వమునందును అసూయ యందును కాలము గడుపుచు, అసహ్యులమై ఒకని నొకడు ద్వేషించుచు ఉంటిమి గాని, 4 మన రక్షకుడైన దేవుని యొక్క దయయు, మానవులయెడల ఆయనకున్న ప్రేమయు ప్రత్యక్షమైనప్పుడు, 5 మనము నీతిని అనుసరించి చేసిన క్రియలమూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మసంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుటద్వారాను మనలను రక్షించెను. 6 మనమాయన కృపవలన నీతిమంతులమని తీర్చబడి నిత్యజీవమును గూర్చిన నిరీక్షణను బట్టి దానికి వారసులమగుటకై 7 ఆ పరిశుద్ధాత్మను మన రక్షకుడైన యేసుక్రీస్తుద్వారా ఆయన మన మీద సమృద్ధిగా కుమ్మరించెను. 8 ఈ మాట నమ్మదగినది గనుక దేవునియందు విశ్వాసముంచినవారు సత్క్రియలను శ్రద్ధగా చేయుటయందు మనస్సుంచునట్లు నీవు ఈ సంగతులను గూర్చి దృఢముగా చెప్పుచుండవలెనని కోరుచున్నాను. ఇవి మంచివియు మనుష్యులకు ప్రయోజనకరమైనవైయున్నవి గాని 9 అవివేకతర్కములను వంశావళులను కలహములను ధర్మశాస్త్రమును గూర్చిన వివాదములను నిష్ ప్రయోజనమును వ్యర్థమునై యున్నవి గనుక వాటికి దూరముగా ఉండుము. 10 మతభేదములు కలిగించు మనుష్యునికి ఒకటి రెండుమారులు బుద్ధి చెప్పిన తరువాత వానిని విసర్జించుము. 11 అట్టివాడు మార్గము తప్పి తనకు తానే శిక్ష విధించుకొనినవాడై పాపము చేయుచున్నాడని నీ వెరుగుదువు.

## వీడ్కోలు – సందేశము

12 నీకొపొలిలో శీతకాలము గడపవలెనని నేను నిర్ణయించుకొన్నాను గనుక నేను అర్తెమానైనను తుకికునైనను నీ యొద్దకు పంపినప్పుడు అక్కడికి నాయొద్దకు వచ్చుటకై ప్రయత్నము చేయుము. 13 ధర్మశాస్త్రవేదియైన జేనాను అపొల్లోనును శీఘ్రముగా సాగనంపుము వారికేమియు తక్కువ లేకుండ చూడుము. 14 మనవారును నిష్ఫలులు కాకుండు నిమిత్తము అవసరమునుబట్టి సమయోచితముగా సత్ క్రియలను శ్రద్ధగా చేయుటకు నేర్చుకొనవలెను. 15 నాయొద్ద ఉన్నవారందరు నీకు వందనములు చెప్పుచున్నారు. విశ్వాసమునుబట్టి మమ్మును ప్రేమించువారికి మా వందనములు చెప్పుము. కృప మీ అందరికి తోడై యుండును గాక.